క్లుప్తంగా

న్యాయస్థానాల తీర్పులను అమలుచేయండి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 301 రోజులుగా ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నేత కె. ఆదినారాయణ, కార్మికులు సుభాని, యహోషువా, రమాదేవి, శారమ్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తాడేపల్లి రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేయనున్నారు. మంగళవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తాడేపల్లిలోని ఆయన నివాసం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ కేఎల్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా సుమారు రూ.40 లక్షల విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందజేశామని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారని, త్వరలో వీటిని అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, సంస్థ డైరెక్టర్ ప్రీతమ్‌రెడ్డి, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ ఎంపీపీకి నివాళి

ఫిరంగిపురం: మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్ ఎంపీపీ గుమ్మడి చంద్రం అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, నాయకులు గొల్లపాలెంలో చంద్రం కుటుంబసభ్యులను పరామర్శించారు. చంద్రం మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్పంచ్ దాసరి మెల్కియా, ఎస్.చిన్నప్ప, జె.ఆనంద్, సంగీతరావు, శ్యామ్, చిట్టా అంజిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, ఒ.పిచ్చిరెడ్డి, కె.ప్రవీణ్‌రెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, హేమలతారెడ్డి, సాల్మన్,సయ్యద్ సైదులు, ఇజ్రాయిల్ నివాళులర్పించారు.

అనుమానితులపై కేసు నమోదు

మంగళగిరి టౌన్: అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్ మాట్లాడుతూ మంగళగిరి మండల పరిధిలోని కాజ గ్రామం వెంకటరెడ్డి అండర్‌పాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. విచారణ చేయగా విజయవాడకు చెందిన వారిగా గుర్తించామని, అర్ధరాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కారణంగా కేసు నమోదు చేసి, సోమవారం మంగళగిరి తహసీల్దార్ ఎదుట హాజరుపరి బైండోవర్ చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో అవసరం లేకుండా తిరిగేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు

పొన్నూరు: పురపాలక సంఘ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. 21వ వార్డు ఎస్పీపీ రోడ్డులోని ఓ దుకాణంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో విక్రయానికి ఉంచిన నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను గుర్తించారు.

ఇళ్ల మధ్యలో నీరు.. పట్టించుకోరూ!

- వర్షం నీరు నిలవడంతో రహదారులు బురదమయం
- 'తాడేపల్లి' పరిధిలో ప్రజలకు తిప్పలు



దోలాస్‌నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీళ్లు

తాడేపల్లి రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇళ్లలో మధ్యలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్, బాపనయ్యనగర్‌లో పలు ప్రాంతాల్లో వర్షం నీరు, బురద పేరుకుపోయాయి. రెండు నెలలుగా పారిశుద్ధ్య పనులు సరిగా జరగడం లేదని, పది రోజులకొకసారి భారీగా వర్షాలు పడుతుండటంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. నివాసాలకు వెళ్లే ప్రతి రహదారి బురదమయంగా ఉంటోంది.

ఆరని తేమ

ఈ ప్రాంతంలో ఇళ్లలో తేమ కూడా ఆరడం లేదు. ఈ కారణంగా పిల్లలు వ్యాధులబారిన పడుతున్నారు. ప్రభుత్వ వైద్యులు వచ్చి చూసినా వారు మళ్లీ ఇటు రావడానికి సమయం పడుతోంది. ఈలోపు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు బురదగా..

తాగునీరు బురదగా వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసుకోవడానికి, తాగడానికి రోజూ రూ. 20 పెట్టి మినరల్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తోందని, రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి వారు 10 రూపాయలుపెట్టి బురదలో వెళ్లి వాటర్ క్యాన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇంటికి వచ్చి వాటర్ క్యాన్ వెయ్యాలంటే రూ. 20 రూపాయలు తీసుకుంటున్నారు.

దోమల విజృంభణ

నిత్యం వర్షం నీరు, మురుగు నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల మందు పిచికారి చేసినా ఫలితం ఉండటం లేదు. దోమలు కుట్టడంతో పెద్దలకు, పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయని, జ్వరం వచ్చి తగ్గిన తర్వాత ఐదారు రోజులు బాగా నీరసంగా ఉంటోందని తెలిపారు. డయేరియా, డెంగీలాంటి వ్యాధులు రాకముందే మా ప్రాంత ప్రజలను మురుగు బారి నుంచి బయట పడవేయాలని ఆ ప్రాంత వాసులు కోరుకుంటున్నారు. అధికారులు మాత్రం ఖాళీస్థలాల్లో నీళ్లు ఉంటున్నాయని, వారిని పలుమార్లు హెచ్చరించినట్లు తెలిపారు. ఖాళీ స్థలాల్లో, పల్లంగా ఉన్న రోడ్లలో నీళ్లు నిలుస్తుండటంతో అక్కడ ఉన్న పేదల ఇళ్లల్లోకి కూడా తేమ, ఊటలాంటివి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు ఆయా ప్రాంతాల్లో సమగ్రమైన సర్వే నిర్వహించి మురుగు, వర్షం నీరు తిష్ట వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు కోరుతున్నారు.



నీళ్లు నిలవడంతో రోడ్డుపై పాచి



మురుగు, వర్షం నీరు, బురదను తొలగించాలంటున్న మహిళలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- కదం తొక్కిన వైస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం



జెండా ఊపి గుంటూరుకు బయలుదేరిన సుధాకర్‌బాబు, వేమారెడ్డి తదితరులు

మంగళగిరి టౌన్: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర విభాగ అధ్యక్షుడు సుధాకర్‌బాబు, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. ఆత్మకూరు బైపాస్ రోడ్ వెంట ఉన్న పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో జరుగుతున్న కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఉచితంగా వైద్యవిద్యను అందించాలని రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. పి.పి.పి. అంటేనే ప్రైవేట్‌కు కట్టబెట్టడమేనని, జీవోను వెనక్కు తీసుకునే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిన మంచి పేరును సహించలేక పి.పి.పి. విధానంతో కళాశాలల ప్రైవేటీకరణకు కంకణం కట్టుకుందన్నారు. అనంతరం జెండా ఊపి కార్యాలయం నుంచి గుంటూరుకు బయలుదేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షుడు కట్టెపోగు భూషణం, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాము, మంగళగిరి పట్టణ ఎస్సీ విభాగ అధ్యక్షుడు మాతంగి బాబు, మంగళగిరి మండల ఎస్సీ విభాగ అధ్యక్షుడు గర్నేపూడి సుభాకర్, తాడేపల్లి పట్టణ ఎస్సీ విభాగ అధ్యక్షుడు కూరగంటి ఉదయ్‌రాజు, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ విభాగ అధ్యక్షుడు చిలకా విక్టరీ ఇమ్మానియేల్, మంగళగిరి మండల కార్యదర్శి విజయబాబు, మంగళగిరి మండల ఎస్సీ విభాగ ఉపాధ్యక్షులు చక్రవర్తి, కూరగంటి ఆదాము, కలకోటి చక్రి, బేతపూడి కిషోర్, శేషు, రవి, కళ్యాణ్, హర్ష, రవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నేతలు

దుగ్గిరాల: మినుము, కంద, పసుపు పంట రైతులు కృష్ణా నది ముంపునకు గురై దెబ్బతిన్నాయని, నష్ట పరిహారం అందించి రైతులను కష్టాల నుంచి విముక్తులను చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం పెదకొండూరు, వీర్లపాలెంలో కృష్ణానది ముంపునకు గురైన పంట చేలను కౌలు రైతు సంఘం జిల్లా నాయకుల పరిశీలించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సుమారుగా మినుముకు రూ.10 వేలు, పసుపు సాగుకు రూ.40 వేలు ఖర్చు అయ్యాయని తెలిపారు. వరద ముంపు కారణంగా నీరు ఎక్కువ రోజులు నిలబడితే దుంప కుళ్లే ప్రమాదం ఉందని, పంట పూర్తిగా దెబ్బతిని పోతుందని చెప్పారు. పసుపు పంటకు రూ.50 వేలు, మినుప పంటకు రూ.10 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, మన్నవ నాగమల్లేశ్వర రావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, యాకోబు, బుల్లాబ్బాయి, సుబ్బారావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

దేదీప్యమానం



అమీనాబాద్ మూలాంకురేశ్వరి ఆలయంలో..



ఉండవల్లి రామమందిరంలో



కనకదుర్గ ఆలయంలో దుర్గాదేవిగా..

- వైభవంగా దేవీ శరన్నవరాత్రులు
- అమ్మ నామస్మరణతో పులకింత



విజయకీలాద్రిపై పూజా కార్యక్రమాల్లో భక్తులు

మంగళగిరి టౌన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా చూసి మనసారా ప్రార్థించి ఇళ్లకు వెనుదిరిగారు. పాత మంగళగిరి దుర్గ నగర్ బైపాస్ వెంట ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈఓ ఇంటూరి దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– మంగళగిరి పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్ రాజీవ్ గృహకల్ప రోడ్డు వెంట కాళీమాత ఆలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొత్తపేటలో...

పట్టణ పరిధిలోని కొత్తపేటలో ఉన్న శ్రీ బాల చౌడేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

దుగ్గిరాల: కంఠంరాజుకొండూరు శ్రీ మహంకాళీ ఆలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.


ఫిరంగిపురం: అమీనాబాద్‌లో మూలాంకురేశ్వరి ఆలయంలో అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బత్తుల వేణుగోపాలబాబు ఆధ్వర్యంలో అందజేశారు.

మేడికొండూరు: మండలంలోని డోకిపర్రులో అమ్మవారు కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. మూల విరాట్‌కు కుంకుమార్చన చేశారు. ఆలయ ధర్మకర్త మేడికొండూరు జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.


తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా

తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని వివిధ దేవాలయాల్లో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. తాడేపల్లి శ్రీ గంగా బాలత్రిపుర సుందరీదేవి శ్రీ రాజరాజేశ్వరి సమేత త్రిపుర తాండేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు, ఉండవల్లి రెడ్ల రామమందిరంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.



తాడేపల్లి త్రిపురతాండేశ్వర స్వామి ఆలయంలో..



కాళీమాత ఆలయంలో శ్రీదుర్గాదేవిగా



కొత్తపేటలో ..



కంఠంరాజు కొండూరులో..

కార్యకర్తలకు డిజిటల్ బుక్‌తో రక్షణ

- కూటమి అన్యాయాలను రికార్డు చేయండి
- మండల స్థాయి నాయకులు



స్కానర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు ఎం.శివరామి రెడ్డి, నేతలు


దుగ్గిరాల: అన్యాయానికి గురైన కార్యకర్తలకు రక్షణగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ప్రవేశపెట్టారని దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి అరుణ చెప్పారు. మంగళవారం దుగ్గిరాల మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, నేతలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ బ్రోచర్‌లను ఆవిష్కరించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మేనిఫెస్టోను పూర్తిస్థాయిలో అమలుచేశారని గుర్తు చేశారు. ఆయన పాలనలో ప్రజలకు ఇబ్బంది కలిగించలేదని, కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం మంచి చేయకపోగా హింసను పెంచుతూ, దాడులు, అక్రమ కేసులు, నిర్బంధాలతో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన డిజిటల్‌బుక్ కార్యకర్తలకు మనోధైర్యం, భరోసానిస్తుందనడంలో సందేహం లేదన్నారు. అన్యాయం చేసిన వారికి చట్టపరంగా శిక్ష పడేలా చూడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో పేరుకలపూడి సర్పంచి గంపల గంగాధరరావు, బీసీ సెల్ నాయకులు ఎస్.వెంకట్రావు, ఎస్. నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ ఎస్.రత్నం, నేతలు ఎస్.కోటేశ్వరరావు, పి.సంసోనమ్మ, యేమినేని ధనుంజయ్, ఉప్పాల ఆనంద్ బాబు, యూత్ వింగ్ ఎ.నాగరాజు, సుబ్బారావు, బాజీ, షేక్ అబ్దుల్ నజీర్, నాని, జార్జి పాల్గొన్నారు.

అల్లంవారి పాలెంలో..


ఫిరంగిపురం: ప్రతి ఒక్కరినీ కాపాడేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ స్కానర్లు అందుబాటులోకి తెచ్చారని దాంతో కష్టాలు తొలగిపోతాయని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల విభాగాల ఆధ్వర్యంలో డిజిటల్ బుక్ స్కానర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు, ఇబ్బందుల నుంచి కాపాడేందుకు డిజిటల్ బుక్ స్కానర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వాటిద్వారా తమకష్టాలు అధిష్టానానికి తెలియజేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, ఒ.పిచ్చిరెడ్డి, పాలపాటి రఘు, కొమ్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కె.అప్పిరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, పెరికల చిన్నా, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చేవూరి రామమోహన్ రెడ్డి, వై.హేమలతారెడ్డి, సయ్యద్ సైదులు, సాల్మన్, అమానుల్లా, టి.కృష్ణ, ఇజ్రాయిల్, బి. ఫ్రాన్సిస్, మోరంరెడ్డి, పిచ్చిరెడ్డి, జె.రవి, ఎం.జోజిబాబు,ఎస్. నాగరాజు, లింగారావు, చల్లా వెంకటరెడ్డి, రాజేష్, ఎం.శ్రీనివాసరెడ్డి, వినోద్, కె.సురేష్, కృష్ణారెడ్డి, బాలిరెడ్డి, జోసఫ్, శివాంజినేయులు, నిర్మల, టి.నాగవేణి, పి.సుజాత, బుజ్జి, మస్తాన్‌బి, తేజరాణి పాల్గొన్నారు.

తుళ్లూరులో..

తాడికొండ: కూటమి నాయకుల వికృత చర్యలకు ఇబ్బందులకు గురై అన్యాయం జరిగిన కార్యకర్తలకు తగిన న్యాయం చేసేందుకే జగనన్న డిజిటల్ బుక్‌ను ఏర్పాటు చేశారని తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు మైనేని నాగమల్లేశ్వరావు అన్నారు. మంగళవారం తుళ్లూరు తులసీ థియేటర్ ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి హయాంలో ఇబ్బందులు పడ్డ ప్రతి కార్యకర్తను కాపాడుకునేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారని, ఇకపై ప్రతి కార్యకర్త, నాయకులు తమకు జరిగిన అన్యాయాన్ని దానిలో రికార్డు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పుల శేషగిరిరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం సంయుక్త కార్యదర్శి ఆరేపల్లి జోజి, నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు కంతేటి అశోక్, తుళ్లూరు మండల ఎస్సీసెల్, సోషల్ మీడియా, యువజన విభాగం అధ్యక్షులు కోలేటి అనిల్, యస్వంత్ యాదయ్, తోకల రాఘవ, తాడికొండ నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు కంతేటి అశోక్ గ్రామ నాయకులు కాకర్ల నాగేశ్వరావు, నాయుడు నాగేశ్వరావు, నేలపాటి నాగేంద్ర కంతేటి బాలు, అబ్బరాజుపాలెం పార్టీ అధ్యక్షులు బండి జోజి, కాకుమాను బ్రహ్మయ్య, రాయపూడి గ్రామపార్టీ అధ్యక్షులు జానీ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ



తుళ్లూరులో క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న నాగమల్లేశ్వరరావు, నేతలు

ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

తాడేపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఆలిండియా మోటార్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించిందని, ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నామన్నారు. వాహన మిత్ర పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలను ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటోడ్రైవర్లు స్వయం ఉపాధి పొందుతున్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో వీరికి బాడుగలు తగ్గాయన్నారు. ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర కింద 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

వాహన కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రూ.4 లక్షలు సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఆటోలకు పార్కింగ్‌స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా శేఖర్‌బాబు, ఉపాధ్యక్షులుగా శివ, కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జోషి, కోశాధికారిగా మధుబాలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పల్లె కృష్ణ, ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్లు సుశీల రావు, దాసు, కోటిబాబు, మరియబాబు, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ

మంగళగిరి టౌన్: నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు, గృహిణులకు ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్ పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని మానవ సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ అక్టోబర్ 25న సంస్థ ఆధ్వర్యంలో శాప్ఎస్‌డీ శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. కనీస విద్యార్హత డిగ్రీ ఉండాలని, వయసుతో నిమిత్తం లేదని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణ తర్వాత ఉద్యోగావకాశాలకు సంస్థ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ సభ్యులు శివప్రసాద్, హరీష్, శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలు దాటినా ముహూర్తం దొరకలేదాయే!

గుర్రంవారి చెరువుపై నిర్మించిన వంతెన



నిర్మాణం పూర్తై నిరుపయోగంగా వంతెన

పొన్నెకల్లు(తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లులో గుర్రంవారి చెరువుపై ఇటీవల నిర్మించిన వంతెన నిర్మాణం పూర్తై 3 నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటుగా తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి, గరికపాడు గ్రామాలతో పాటు మేడికొండూరు మండలంలోని పలు గ్రామాలు, గుంటూరు రూరల్ మండలం పలకలూరు మీదుగా రాజధానికి వచ్చే ప్రయాణికులకు పల్నాడు నుంచి వచ్చే వారికి ఇదే ప్రధాన రహదారి. అయితే వరదలు వచ్చినపుడు గ్రామ శివారున ఉన్న లో లెవెల్ వంతెన మీదుగా నీరు పారుదల అయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అష్టకష్టాలు దాటి వంతెన నిర్మాణం పూర్తైనా దానిని ప్రారంభించేందుకు మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. దీనిపై గ్రామస్తులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. సంబంధిత అధికారులు స్పందించి చిన్నపాటి పనులు పూర్తిచేసి వెంటనే వంతెన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముప్పై గ్రామాల ప్రజల పాట్లు



ఇక్కడ కాంట్రాక్టరని అడిగితే ఇంజినీరింగ్ వాళ్ళు వచ్చి మార్కింగ్ ఇస్తే వెంటనే పని పూర్తి చేస్తామంటున్నారు. ఈ విషయంపై గ్రీవెన్స్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వగా ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ వాళ్లు వర్షాలు కురుస్తున్నాయి గ్రావెల్ దొరకటం లేదు ఒక నెల టైం ఇస్తే పని పూర్తి చేస్తాం అని సమాధానం చెబుతున్నారు. అసలు బ్రిడ్జి పని మూడు నెలల క్రితమే పూర్తి అయ్యింది. ఒకరి మీద ఒకరు సాకులు చెబుతూ పని ఆపేయడంతో ముప్పై గ్రామాల ప్రజలు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

– యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, పొన్నెకల్లు